# శ్రాద్ధం



నాగావళీ నది పక్క ఊరు.

ఎంత అందంగా ఉండాలో అంత అందంగానూ ఉంది.

ఆ ఊరి ఆడపడుచులు

ఎంత వయ్యారంగా ఉండాలో అంత వయ్యారం గానూ ఉన్నారు.

అదే ఊరి కుర్రకారు

ఎంత చలాకీగా ఉండాలో అంత చలాకీగానూ ఉన్నారు.

అలాటి ఊరి అందాన్ని మించిన అందంగా ఎదురెదురుగా రెండు డాబా ఇళ్లు ఉన్నాయి.

ఒక డాబా ఇంటికీ మరొక డాబా ఇంటికీ ఉండవలసినంతగా కక్ష ఉంది. ఉండవలసిన దానికంటే హెచ్చుగా కార్పణ్యం ఉంది. ఆ రెంటినీ మించే అంతటి పోటీ ఉంది.

ఒక డాబా ఇంట్లో అందాల బరిణెలాంటి అమ్మాయి ఉంది. మరో డాబా ఇంట్లో బగ్గీ గుర్రం లాంటి అబ్బాయి ఉన్నాడు.

రెండు డాబా ఇళ్ల లోనూ పోటా పోటీగా రెండు మీసాల ముఖాలున్నాయి. ఒక ముఖం చూస్తే మరొక ముఖం మీసం మెలితిప్పే స్థితి కూడా ఉంది.

అమ్మాయి డాబా మీసాన్ని ఊరందరూ అభిమానిస్తారు. అబ్బాయి డాబా మీసం అది సహించలేక అతని కంటే పెద్దవాడ్ననిపించుకొనాలని అబ్బాయి చేత కాలేజీ చదువు చదివించి సవాలు విసిరాడు.

అమ్మాయి డాబా మీసం నేను మాత్రం తక్కువ తిన్నానా.. అన్జెప్పి అమ్మాయిని కాలేజీకే ఫస్టనిపించి సవాలుకి జవాబు చెప్పేడు.

ఆ విధంగా ఎదురెదురు డాబా మీసాలు ఎదురెదురు కోర చూపులు చూసుకోగా ఎదురెదుర డాబాల అమ్మాయి, అబ్బాయి ఎదురెదురు ఓర చూపులు చూసుకున్నారు.

ఓర చూపుల్ని కొద్ది రోజుల్లోనే కోర చూపులు కనిపెట్టేసాయి.

కనిపెట్టిన కోర చూపులు జరపవలసిన అల్లరి జరుపుతుండగా కలిసిన ఓర చూపులు ఒకనాటి అర్ధరాత్రి ఒకటయిపోయి నదిని దాటి ఎగిరెళ్లిపోయాయి.

నదిని దాటుతుండగా అమ్మాయి మొదట తన సహజ భయాన్ని కనబరచగా.

నువ్వులేంది నిముషం కూడా నేను బతకలేను. పెద్దవాళ్ల పట్టుదలలకు మన పవిత్ర ప్రేమ బలి కాకూడదు. కానివ్వను. నా కంఠంలో ప్రాణం ఉండగా నిన్ను నా నుండి ఏ శక్తీ విడదీయడం కల్ల. ఎంతటి షెమప్రళయం ముంచుకొనివచ్చినా చావుగానీ బతుగ్గానీ నీతోనే నాకు. నాతోనే నీకు అని పిడికిలి బిగించి చెప్పి సదరు సహజ భయాన్ని చెదరగొట్టేడు.

సంవత్సరం గడిచింది.

తెచ్చిన డబ్బు సరిసరి అన్న పరిస్థితి వచ్చింది. ఆసమయంలో కొన్ని ఇచ్చితమైన ఆశయాలున్న వారితో ఆమెకు పరిచయమైంది.

వారు వీరి పరిస్థితి తెలుసుకున్నారు. వారి ప్రయత్నం మీద అతడికి ఉద్యోగం దొరికింది. వారి ఆశయాల పాటల్లో ఆమె పాలు పంచుకుంటూ ఉండగా, అతడు దొరికిన ఉద్యోగంలో పెరగడానికి ప్లాను వేసుకుంటున్నాడు.

దంపతులిద్దరూ అమందానందకందళిత హృదయాంతరంగులై ఆనంద డోలికల్లో తేలిపోయారు.

ఇద్దరూ అలా తేలియాడగా

అమ్మాయి కావాలా? అబ్బాయి కావాలా? వేలు పట్టుకో అంటూ వారు వేడి వెచ్చటి మాటలు మాట్లాడవలసిన పరిస్థితి లేకుండానే వారికి బిడ్డ పుట్టి ప్రేయసీ ప్రియులుగా ఉండకుండా తల్లీ తండ్రీ అయిపోయారు.

అప్పుడతడు తండ్రి బాధ్యతగా మాట్లాడుతూ

నువ్వు నా పంచ ప్రాణాల్లో ప్రాణానివి! వీడు నా ఆరోప్రాణం వీడి కోసం, వీడి భవిష్యత్తు కోసం, నీ కోసం, నీ కడుపున పండిన పంట కోసం నా ప్రాణం పణం పెడతాను అని పిడికిలి బిగించి మరోసారి భీమప్రతిజ్ఞ చేశాడు.

మరొక సంవత్సరం మామూలుగానే గడిచిపోయింది.

మంచం పట్టిన డాబాల మీసాలు మరి బతకవన్న కబురు వచ్చింది. కబురువిన్న వెంటనే ఉన్న పాటుగా చంటి బిడ్డన్ని పట్టుకుని ఇద్దరూ హడావిడిగా స్వంత ఊరికి బయల్దేరారు.

ఊరు దగ్గరపడే సరికి ఆకాశం మబ్బులుపట్టింది. మబ్బులుపట్టిన ఆకాశం మరి కొంచెం సేపటికి మెరుపులుధారగా వర్షించింది.

కుండపోతగా కురుస్తున్న వర్షంలో తడిసి ముద్దయి పోతున్నా ఆమె మాత్రం బిడ్డ తడవకుండా సర్వ ప్రయత్నాలూ చేస్తోంది. ఇద్దరూ ఊరి పక్క నది గట్టుమీదకి చేరుకున్నారు.

ఎదర నిండుగా ఒడ్డుల్ని ఒరుసుకుంటూ పారుతున్న నదిని గమనించారు. నది అవతలి వైపు వర్షపు ధారల్లో కనబడుతున్న ఆనాడు వాళ్లు వదిలి వచ్చిన ఊరు!

ఊళ్లో అస్పష్టంగా కనబడుతున్న వాళ్ల డాబా ఇళ్లు! అందులో చావు బతుకులో పోరాడుతున్న తమ తండ్రులు. అతడు నదిని చూస్తూ ఆమెతో

దిగు. మరేం భయంలేదు. నిత్యం నేను ఈదిన నదే గదా ఇది. అని దిగమన్నాడు.

ఆమె నదినీ భర్త ముఖాన్నీ చూసింది.

ఎన్నెన్నో జ్ఞాపకాలతోపాటు ఆనాడు అతనితో వచ్చేస్తున్నప్పుడు ఈ నదిలో నడుస్తుండగా అతడన్న మాటలు కూడా జ్ఞాపకం వచ్చేయి.

భర్త వెనకనే నదిలోకి దిగింది.

నీరు పెద్ద ముణుకులు దాటి నడుం వరకూ ముంచబోతుంది. మనిషి సగం మునిగేసరికి ఆమె బిడ్డను గుండెల్లో దాచుకుంటుండగా ఆ బిడ్డ పుట్టినప్పుడు భర్త అనిన మాటలు ఆమెకు మళ్లీ గుర్తుకువచ్చాయి..

నది చాలా వెడల్పుగా తీసి పారుతుంది. చిన్నగా కెలకవేస్తుంది.

బిడ్డతో నది మధ్యకు చేరేసరికి నది కెరటాలు

వేస్తుంది.

నది పొంగుతోంది! పద పద అన్నాడతడు. ఆమె భర్త భుజం పట్టుకుని భయంతో బిడ్డన్ని భర్తకి అందించింది.

గంగ పొంగిపోయింది!

అతడు భార్యకు జాగ్రత్త చెప్పి బిడ్డను మీద వేసుకుని ఈత కొడుతు కొంచెం దూరంవెళ్లేసరికి నది హోరు పెడుతూ ఒక్క విసురు విసిరింది.

ఆ విసురు దెబ్బకి ఆమె భర్తను వాటేసుకుంది.

అతడు మాత్రం తన మీదున్న బిడ్డన్ని తీసి నదిలో వదిలేశాడు.

ఆమె కెవ్వుమంది.

ఏమండీ! అని గొంతు పగిలేలా కేకపెట్టింది. అతడు ఈదుతూనే

ముగ్గురం ఈ ఉధృతంలో బతకం. మనం బతికుండగానే బిడ్డలు కరువా! పోనీ కాక పోతే మరొకడు అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా భర్త ముఖాన్ని చూసింది.

ఆనాడు! బిడ్డ పుట్టిన నాటి ఆ ముఖం... ఈముఖం... ఆ నాటి ఆ మాటలు.... ఈ నాటి ఈమాటలు...

రెండు మునకలు మాత్రమేవేసి మరి కనిపించకుండా పోయిన బిడ్డ.

బిడ్డ ఏమయ్యాడో కూడా కనీసం చూడకుండా అవతలి ఒడ్డునే చూస్తున్న అతడి చూపు

సరి!నది మరి పదిగజాలు మాత్రమే మిగిలింది.

ఆమెకన్నీటి ధారలు వర్షపు ధారల్లో కలగలిసి అంతామసక!

నీరు సుడి తిరుగుతోంది.

మసకలో ఆమెకి నీరు సుడి తిరగడం కనిపించలేదు.

అతడు సుడిని చూసేడు అంతే.

ఆమెతో భుజంమీద చెయ్యితీసేయ్ అని తన భుజం మీద ఆనుకున్న ఆమె చేతిని బలంగా ఒక్కసారి లాగి నదిలోకి తోసేసేడు.

ఏమండీ! బిడ్డడండీ! చూడరేమండీ అని ఆమె అతడ్ని అందుకోబోయింది.

అందలేదు!

ఆమె ఒకసారి మునిగి మళ్లీ తేలింది.

బిడ్డన్ని చూడరేమండీ? మన బిడ్డండీ? అంటూ మరోసారి మునిగిపోయి తేలి భర్తను అందుకొని గట్టిగా కౌగలించుకుంది.

సుడి సమీపించడం గమనించిన అతడు మరింక వదలదన్న భయంతో ఆమెపొట్టలో గట్టిగా బలంగా తన్నేడు.

అమ్మా! అన్న పెనుకేకతో ఆమెవెల్లకిలా నీటి మీద పడిపోయింది.

అంతే! సుడి ఆమెను చుట్టేసింది.

అతడు లాఘవంగా సుడిదాటి ఒడ్డుకు



క్లాస్ టీచర్ తన స్టూడెంట్స్‌ని ఇలా అడిగింది.

'మీలో ఎంత మంది స్వర్గానికి రాదల్చుకున్నారో చేతులెత్తండి'

క్లాసులో అందరూ చేతులెత్తారు ఒక అమ్మాయి తప్ప

'నువ్వెందుకు చెయ్యెత్తలేదు? నీకు స్వర్గం అంటే ఇష్టంలేదా?' అడిగింది టీచర్

'ఇష్టమే టీచర్. కానీ మా మమ్మీ స్కూలయిపోగానే ఇంటికిరా ఎక్కడికీ వెళ్లద్దు. అని చెప్పింది.'

– గొల్లపూడి శైలజ, మారుతీనగర్

చేరుకున్నాడు.

సుడిలోపడిపోయి మునిగిపోయిన ఆమె మరు నిముషంలో రేవుకి కాస్త దూరంలో ఒడ్డుకి కొట్టివేయబడింది

అతడు ఆశ్చర్యపడుతూ ఆమె దగ్గరకు వెళ్లాడు.

ఆమె ముక్కులోకీ నోట్లోకి పోయిన నీటికి ఉక్కిరి బిక్కిరయి గజ గజ వణుకుతూ పొట్టలో తగిలిన దెబ్బకు నిటారుగా నిలబడలేక ఒక చేత్తో పొట్టనీ మరో చేత్తో ఒడ్డునున్న రెల్లుగడ్డినీ ఊతగా పట్టుకుని ఆయాసపడుతూ నదినే చూస్తుంది.

ఆమె దగ్గరగా వచ్చి అతడు.

అదృష్టవంతురాలివి. సుడి ఒడ్డుకే కొట్టేసింది అన్నాడు.

ఆ మాటలు విని ఆమె తుళ్లిపడి అతడ్ని పెనుభూతాన్ని చూసినట్టు చూసింది.

అతడిముఖం కనబడగానే ఆమె కళ్లు అగ్నిని వర్షించేయి.

అదేమీ గమనించని అతడు

పద పద పాపం ముసలాళ్లకు ఎలా ఉందో పద పదమని ఆమె చేతిని అందుకోబోయాడు.

ఆమె అతడి చేతిని విసిరికొట్టి ఛీత్కారం చేసింది. అతడు చూపుతున్న ఆత్రుతలోగల స్వార్థం అర్థం గావడంతో ఆమె నిలువునా కంపించిపోతూ

ఛీ నీచుడా! నువ్వు మనిషివి కావు. స్వార్థం ఆవహించిన పెనుభూతానివి.నా ముందు నిలబడకు! నా ముందు నిలబడకు. తక్షణం వెళ్లిపో. అంటుండగా, కళ్లు నిప్పుల్ని కక్కగా తిరిగి ఆమె మాటలు మంటలుగా – నీ తొందర నాకు తెలుసును. అసలు నువ్వు నన్ను ప్రేమించడంలోగల అంతరార్థం కూడా నాకు ఇవాళ తెలిసిపోయింది. నువ్వూ నీ వెనకగల సమాజంయొక్క యథార్థ రూపం. ఈఒక్క అనుభవంతో అర్థమైపోయింది.

ఆ ముసలాళ్లు ఛస్తే నీకు ఆడాబా, ఇళ్లూ నాటి వెనకగల ఆస్తులూనస్తాయి. పెళ్ళాలు ఛస్తే పెళ్లాలుదొరుకుతారు. కట్నాలు కూడా తెస్తారు! పిల్లలు ఛస్తే మళ్లీ పుడతారు. పుట్టకపోతే పుట్టించే ఆడది దొరికినంత వరకూ పెళ్లిళ్లు చేసుకుంటూనేవుంటావు.

ఎవరేమైపోయినా నువ్వు మాత్రం బతికేస్తే చాలు. అలా బతికేయడానికి నువ్వు సవాలక్ష దార్లు వెతుకుతావు. కోటానుకోట్ల వలలు విసురుతావు. అందుకు సరిపడా రీజన్లు తీస్తావు.

నువ్వు బతకడం... అదొక్కటే నీకు ప్రధానం. అంతే కదురా లుచ్చా!

నేను వెళ్తున్నాను.

ఈరోజు ఈనదిలో ఏ స్వార్థ ఫలితంగా ఎంతటి నిస్సహాయంగా నా బిడ్డడు కొట్టుకుని పోయాడో అంతకంటే నిస్సహాయంగా మీ స్వార్థ సమాజం యావత్తూ కొట్టుకుని పోయి ఈ నేలమీద పూర్తిగా తుడిచి పెట్టుకొనిపోయేటంతవరకూ నేను నిద్రపోను గాక పోను.. కాస్కో .. కాస్కోండిరా లుచ్చాల్లారా.

అని ఒండూ ఇసుకా కలిసిన గట్టుమీద బురదని దోసిలితో తీసి అతడి ముఖానికేసి కొట్టింది.

ఆమె కొంచెం సేపు అలుపు తీర్చుకుంది.

నిర్ఘాంతపోయి ఆమెను చూస్తున్న అతని ముఖాన్ని అసహ్యంగా చూసి కాండ్రించి తుపుక్కున ఉమ్మింది. తిరిగి పూర్వపు బలాన్ని పుంజుకుంది. నది గట్టుమీద పరుగుతీస్తూ.

నాయనా.. నా బిడ్డా.. అంటూ భవిష్యత్

భూషణం

తరం కోసం వేసిన పొలికేక నదిహోరును మించి నలుదిక్కులా మారుమోగింది.

పల్లెలు పలికేయి! పట్నాలు తెలుసుకున్నాయి!

కొండలూ కోనలూ అగాథమైన లోయలూ అందుకున్నాయి!

ఆమె వేసిన ప్రతి అడుగునూ స్వాగతించాయి! ●